


47 సంవత్సరాల క్రిందట విడుదలైన ఈ నవల ఆ రోజుల్లో సృష్టించిన సంచలనం అంతా ఇంతా కాదు. 1962 నుంచీ 1976 వరకూ మూడు సార్లు పునర్ముద్రించబడింది. దాదాపు 15,000 కాపీలు పైగా అమ్ముడుపోయాయి ఆ రోజుల్లోనే. ఈ నవల పుస్తకం వెనుక నున్న క్రింది వాక్యాలు నవల పట్ల ఉత్కంఠతని రెట్టింపు చేస్తాయి.

***

భారతి భుజాల మీద ఏదో చేతులు వేసింది. మొహానికి ఏదో రాసుకుంది? ఏమిటది?

మెట్లమీద ప్రసాద్ చూసిన ఆకారం ఏమిటి? మనిషి కాదని నిశ్చయంగా ఎందుకన్నాడు? వైకుంఠరావు చనిపోయి రెండు రోజులైంది. అతని శవం, మేడమీద కుర్చీలో ఎట్లా ఉంది? ఇంట్లో ఎట్లా తిరుగుతోంది?

"దూరంగా పొండి, తలుపు దగ్గరకి వెళ్ళకండి" అని అరుస్తూ భారతి ప్రసాద్‌నీ, శేఖర్‌నీ ఎందుకు వెనక్కి లాగింది.?

ఈ పుస్తకం రాత్రిళ్ళు ముట్టుకోవద్దు. ఒంటరిగా ఉన్నప్పుడు చదవొద్దు. భయం వేసినప్పుడు అప్పటికి చదవడం ఆపి కొంతసేపటి తర్వాత మళ్ళీ మొదలుపెట్టండి..!

(తెలుగులో మొట్టమొదటి హారర్ ఫిక్షన్ నవల ఇది . మొదటి ముద్రణ: 1962లో)




## (క్రిందటి సంచిక నుంచీ తరువాయి)

"ఈ వాన వరదలు తగ్గేంతవరకూ ఎవరూ వెళ్ళడానికి ఎలాగూ వీలులేదుగా! ఇంకా ఎన్ని రోజులు మనం ఈ ఇంట్లో ఉండవలసి వస్తుందో తెలియదు కనక ముందు మనం ఆలోచించవలసిన విషయం ఎవరికీ ఏ అపాయం కలగకుండా కట్టుదిట్టం చేయడం అనేది."

నౌకర్లతో సహా అందరూ హాల్లోకి వచ్చేశారు. అందరితోపాటు పద్మ కూడా వచ్చి వాళ్ళ మధ్య నిలబడింది.

"నాన్న పోలేదు బతికే ఉన్నాడు. నాకు కనిపించాడు. నాన్నని ఏం చేశారో చెప్పండి! నాన్నమీద ఎందుకు మీరంతా ఇలా పగపట్టారు?" అని అడిగింది పద్మ.

"పద్మా! నేచెబుతున్న విషయం శ్రద్ధగా విను. నాన్న మరణించాడు. అందులో సందేహం లేదు. నేను నీతో అబద్ధం చెప్పను కాని నువ్వు మీ నాన్నని చూశావన్న విషయం నేనూ నమ్ముతున్నాను" అన్నాడు ప్రసాద్.

"నువ్వూ చూశావా? ఎక్కడ? ఎక్కడున్నాడు? ఎప్పుడు చూశావు?" అడిగింది పద్మ ఆత్రంగా.

"ఇంతకుముందే! ఇక్కడ సోఫాలో కూర్చుని చదువుకుంటున్నాడు. నేనూ, శేఖర్ ఇద్దరం చూశాం.'

"అయితే ఎందుకు వెళ్ళిపోనిచ్చారు? ఎక్కడికి వెళ్ళాడు?"

"మేము హాల్లోకి రాకముందే ఆ నడవలోకి వెళ్ళిపోయాడు. శ్రద్ధగా విను.. చచ్చిపోయిన మనిషి ఇంట్లో తిరగడం సాధ్యమా! మనతో మాట్లాడడం సంభవమా! కాదు -" అని ఇంకా ఏదో చెప్పబోతుండగా "ప్రసాద్! ఆగు! భయంతో ప్రాణాలు పోయేట్లు విపులంగా చెప్పడం దేనికి!" అన్నది భానుమతి.

తల్లి అలా అనగానే ప్రసాద్ చెప్పడం ఆపేశాడు.

"మామయ్య చావుకి కారణం ఏమిటో, భారతి గదిలోకి ఎలా వచ్చాడో తెలుసుకోలేక పోతున్నాము. ఈ ఇంట్లో దెయ్యమో, దెయ్యాలో ఉన్నాయని కొందరి అభిప్రాయం. నాకు దెయ్యాలలో నమ్మకం లేదు. ఎవరో మనిషే ఈ చేష్టలన్నీ చేస్తున్నాడని నా అనుమానం. దెయ్యమైనా మనిషి అయినా మనం జాగ్రత్త పడాలి. ఎవరికీ అపాయం కలగకుండా చూడాలి, ఈ వానా, వరదా ఇంకా ఎన్నిరోజులుంటుందో తెలీదు. మనం తీసుకోవలసిన జాగ్రత్తలు: మొదటిది ఎవరూ ఒంటిగా ఇంట్లో ఉండొద్దు. రెండు ఆడవాళ్ళకి ఎవరో ఒక మగాడు ఎప్పుడూ తోడు ఉండాలి. ఏదైనా అసహజమైనది చూస్తే వెంటనే నాకు తెలియచెయ్యాలి" అన్నాడు శేఖర్. అందరూ తలలు ఊపారు.

"ఇక నౌకర్ల విషయం - ఈ హెచ్చరికలన్నీ మీకూ వర్తిస్తాయి." అని శేఖర్ అంటుండగా

"అదేమిటి?" అన్నది పద్మ.

"ఏమిటి?" అడిగాడు ప్రసాద్ ఆదుర్దాగా.

పద్మ చెయ్యి చాచింది. చేతిమీద ఎర్రగా కనిపించింది అందరికీ.

"ఏమైనా గీసుకుందా?" అడిగాడు ప్రసాద్.

"లేదు ఏదో పడింది చేతిమీద" అని తుడిచేసింది పద్మ చేతిమీద గాయం లేదు.

"నా మెడమీద ఏదో పడ్డది" అన్నది భారతి.

"పురుగయ్యుంటుంది" అన్నాడు లింగమూర్తి.

"నేను చూస్తాను" అని భారతి మెడ పరీక్షగా చూసి వేలితో మెడమీద ఎర్రగా ఉన్న చోట రాసి "రక్తం" అన్నాడు శేఖర్.

"నా మీద కూడా ఏదో పడ్డది" అని కేకేసింది భానుమతి చెయ్యి జాపుతూ. ఆమె చేతి మీద ఎర్రని రక్తపు చుక్క ఉన్నది.

"ఈ రక్తం చుక్కలేమిటి?" అన్నాడు కామరాజు.

"నా మీద కూడా పడ్డది" అని కేకేసింది సావిత్రి.

"అందరి మీద చినుకుల్లా రక్తపుబొట్లు పడుతున్నాయి" అన్నాడు ప్రసాద్.

శేఖర్ లాంతర్ పైకెత్తి పట్టుకుని కప్పు చూశాడు. బాగా ఎత్తుగా ఉండడం వల్ల ఏమీ కనిపించలేదు. వెలుగు అంత పైకి పోవడం లేదు. "టార్చి కావాలి. తెస్తానుండడి" అని లాంతర్ బల్లమీద పెట్టాడు.

"ఒంటిగా వెళ్ళొద్దు" అన్నది భారతి.

"అవును శేఖర్ శేషయ్యనీ, మునయ్యనీ తోడు తీసుకువెళ్ళు" అన్నాడు లింగమూర్తి.

"ఛా ఛ నాకు తోడేమిటి!" అన్నాడు శేఖర్.

"ఇప్పుడు నువ్వేగా ఎవరూ ఎక్కడికీ ఒంటిగా వెళ్ళకూడదని చెప్పావు. శేషయ్యా! అబ్బాయి కూడా వెళ్ళు!" కామరాజు ఆజ్ఞాపించాడు.

శేఖర్ తన గదిలోకి వెళ్ళి నిమిషంలో టార్చి తీసుకుని తిరిగి వచ్చాడు. అందరూ తలలు పైకెత్తి చూశారు. ఎర్రని మరక - చుక్కలు చుక్కలుగా రక్తం పైనుంచి కిందపడుతోంది. ఒక్కసారిగా ఆ మరక కిందనుంచి పక్కకి జరిగారు అందరూ.

"గుడ్ గాడ్! ఎంత రక్తమో!" అన్నాడు ప్రసాద్.

"అందరూ ఇక్కడే ఉన్నారా?" అడిగాడు శేఖర్.

"ఆఁ!"

అందరినీ పేర్లు పెట్టి పిలిచాడు శేఖర్. అందరూ పలికారు.

"అమ్మయ్య! మనలో ఎవరయినా ఇక్కడ లేరేమోనని ఆందోళన పడ్డాను. మేడమీదకి వెళ్ళి చూస్తాను" అన్నాడు శేఖర్.

"ఒద్దు, వెళ్ళవద్దు" అన్నది భారతి శేఖర్‌కి దగ్గిరగా జరిగి.

"చదువుకున్న దానివి నువ్వే ఇలా కంగారు పడతావేమిటి భారతీ! ఎవరో ఒకళ్ళు వెళ్ళి చూడాలి కదా!"

"ఒద్దు - ఏమీ చూడవద్దు మనం అందరం ఇక్కడే ఈ గదిలోనే ఉందాం. వరదలు తగ్గగానే వెళ్ళిపోదాం." అన్నది భారతి ఆవేదనతో.

"అవును. భారతి చెప్పింది బావుంది. అనవసరంగా ప్రాణానికి తెగించడం దేనికి!" అన్నాడు లింగమూర్తి.

"ఈ రక్తం ఎక్కణ్నించి వచ్చిందనే రహస్యం తెలుసుకోవద్దూ" అడిగాడు శేఖర్ చికాకుతో.

"ఏం తెలుస్తుంది? ఇంతకు ముందు జరిగిన వాటిని గురించి ఏం తెలిసింది? ఇదీ అంతే తెలుస్తుంది. ఈ ప్రపంచంలో అన్నీ మనకి తెలిసిన విషయాలు మనం తెలుసుకోగల విషయాలే కావు. తెలియని విషయాలు చాలా ఉన్నాయి. వాటిలో ఇదొకటి. శేఖర్! నువ్వు కాని, మరెవరు కాని సాహసం చెయ్యడం అవివేకం, చావు తప్పితే చాలనుకుని ఇక్కణ్ణించి బయటపడదాం" అన్నది భానుమతి.

"వరదలు తగ్గగానే అందరూ ఈ ఇంట్లోంచి వెళ్ళిపోవచ్చు. కాని ఆలోగా ఈ ఇంట్లో ఏం జరుగుతున్నదీ, ఎందుకు జరుగుతున్నదీ తెలుసుకోవలసిన బాధ్యత ఉంది మనమీద" అని శేఖర్ మెట్లవైపు నడిచాడు.

"ఆగు శేఖర్! నేనూ వస్తున్నాను" కేకేశాడు ప్రసాద్.

"నో! ఏదయినా అపాయం ఉంటే ఆ అపాయంలోకి నిన్ను తీసుకు వెళ్ళడం న్యాయం కాదు" మెట్ల దగ్గిర ఆగి అన్నాడు శేఖర్.

"నువ్వు వెళ్ళడం మాత్రం న్యాయమా! మీ నాన్నకి నువ్వు ఒక్కడివేగా!" ప్రసాద్ జవాబు చెప్పాడు.

"శేఖర్! మేడమీదకి వెళ్ళి చూడాలని నిశ్చయించుకుంటే వెళ్ళు." నేను అభ్యంతరం పెట్టను. కాని నీ కూడా ఇంకో ఇద్దర్ని తీసుకెళ్ళు." అన్నాడు కామరాజు.

"నేనూ, మొద్దబ్బాయి వెళతాం సార్!" అన్నాడు శేషయ్య మెట్ల దగ్గరకి వెళుతూ.

"ఊఁ!" అని ప్రోత్సహించాడు కామరాజు. ముగ్గురూ మెట్లు ఎక్కుతున్నారు. ఎవరూ మాట్లాడడం లేదు.

మేడమీద వాళ్ళు ఏం చూస్తారో అన్న ఆలోచనతో హాల్లో కూర్చున్న వాళ్ళు వణకడం ప్రారంభించారు, టపటపమంటూ రక్తపు చుక్కలు నేలమీద పడుతూనే ఉన్నాయి. బయట పడుతున్న వాన చినుకుల చప్పుడులోంచి, మెట్లమీద అడుగుల చప్పుళ్ళల్లోంచి బిగ్గరగా వినపడుతున్నాయి ఆ టపటపలు.

ముందు శేఖరూ, అతని వెనకే శేషయ్యా, శేషయ్య వెనక మొద్దబ్బాయి ముగ్గురూ మెట్లు ఎక్కారు. మెట్లు ఎక్కి వసారాలో ఆగి ''అవతల నడవలో అయివుంటుంది. కింద హాలుకి సరిగా పైనున్నది నడవా!'' అన్నాడు శేఖర్.

శేషయ్య తల ఊపాడు.

ముగ్గురూ ముందుకి నడిచారు. నడవలో వెలుగు కనిపించింది. ఆ నడవలోకి వెలుగు ఎలా వచ్చిందో గ్రహింపలేక పోయారు. శేఖర్ ఆగిపోయి '' ఆ నడవలో దీపం వెలుగుతోంది'' అన్నాడు శేషయ్యతో. శేషయ తల ఊపి ''ఆ టార్చి ఇవ్వండి'' అని శేఖర్ చేతిలోంచి టార్చి తీసుకుని ముందుకి నడిచాడు. అతని వెనక మొద్దబ్బాయి, శేఖర్ వెళ్ళారు. నడవలోకి వెళ్ళి ముగ్గురూ ఆగిపోయారు.

''గుడ్ గాడ్! ఎంత భీకర దృశ్యం!'' అన్నాడు శేఖర్.

శేషయ్య మాట్లాడకుండా ముందుకి నడిచాడు. మొద్దబ్బాయి, శేఖర్ రాతి బొమ్మల్లా నిలబడ్డారు. నడవా మధ్య ఓ కుర్చీ ఉంది. కుర్చీ చేతిమీద ఒక కొవ్వొత్తి వెలుగుతోంది. వెలుగుతున్న కొవ్వొత్తి గోడమీద విచిత్రమైన నీడలు వెదజల్లుతోంది.

కాని అది కాదు భీకరం. కుర్చీలో కూర్చున్న మనిషి. ఆ మనిషి రెండు చేతులు కుర్చీ చేతుల మీద నుంచి కిందకి వెళ్ళాడుతున్నాయి. ఆ చేతుల కొనలనుంచీ రక్తం కారుతుంది. నేలమీద ఎర్రని మడుగు తయారైంది. అక్కడ కప్పు బీటపడడం వల్ల రక్తం చుక్కలు చుక్కలుగా కింద హాల్లో పడుతోంది.

కుర్చీలో కూర్చున్న ఆ మనిషి ఎవరో గుర్తుపట్టడం సులభం కాదు. వెళ్ళుకు వచ్చిన కళ్ళు తప్ప ఇంకేమీ స్పష్టంగా కనిపించడంలేదు. ఒంటిమీద చర్మం పూర్తిగా ఒలిచేసినట్లు ఒళ్ళంతా ఎర్రగా ఉంది. ఉబ్బిపోయిన మెడ వెళ్ళుకు వచ్చిన నాలిక మాత్రం కనిపిస్తున్నాయి. గాలికి కొవ్వొత్తి వెలుగు రెపరెపలాడుతోంది. ఆ రెప రెపలకి వెలుగునీడలు నాట్యం చేస్తున్నాయి. అందుకే కుర్చీలో కూర్చున్న మనిషి నవ్వుతున్నట్లు, కోపంగా చూస్తున్నట్లు, మాట్లాడుతున్నట్లు, కదులుతున్నట్లు కనిపిస్తోంది. అందుకే శేఖర్, మొద్దబ్బాయి ముందుకి అడుగు వెయ్యలేక పోయారు.

శేషయ్య మాత్రం కుర్చీలో ఉన్న శవాన్ని సమీపించాడు. వేలితో శవం ఒంటిమీద ఎర్రగా వున్న చోట రాశాడు ఏదో జిగటుగా అతుక్కుంది. దీపం వెలుగులో వేలు పరీక్షగా చూశాడు. తర్వాత మోకాళ్ళ మీదకి ఒంగి నేలని పరీక్షగా చూసి లేచి ''ఈయన మీ మామయ్య వైకుంఠరావుగారు'' అన్నాడు.

''మామయ్య ఇక్కడికి ఎలా వచ్చాడు?'' అన్నాడు శేఖర్.

''తనంతట తను రాలేదనే నా నమ్మకం. ఎవరో ఎత్తుకు వచ్చి కుర్చీలో కూర్చోపెట్టి ఉండాలి.

''శవాన్ని ఎవరు ఎత్తుకు వస్తారు?''

''ఏమో! ఏదో కారణం ఉంటుంది.''

శేఖర్ మొహం పాలిపోయింది. నుదురుమీద చమట పోసింది. ''ఈ ఇంట్లో దెయ్యం ఉందని నాకూ నమ్మకం కుదురుతోంది. లేకపోతే శవాన్ని ఆ ఔట్‌హౌస్‌లోంచి తీసుకువచ్చి ఈ కుర్చీలో ఎవరు కూర్చోపెడతారు? ఈ రక్తం ఏమిటి?'' అన్నాడు.

''ఇది రక్తం కాదనుకుంటాను'' శేషయ్య చెప్పాడు.

''మరేమిటి?''

''ఏమిటో తెలియదు. రక్తం కాదు దాదాపు ఇరవై నాలు గంటల క్రితం చనిపోయిన మనిషిలో రక్తం ఇలా ఉండదు''

''దెయ్యాలేమిటి? అంటోంది నా వివేకం. కాని ఈ దృశ్యాలన్నీ చూస్తుంటే దెయ్యాలు ఉన్నాయేమో అనిపిస్తోంది శేషయ్యా! నువ్వేమంటావు?''

శేషయ్య లేచి నిలుచుని కుర్చీలో ఉన్న శవాన్ని కాసేపు పరీక్షగా చూసి, "దెయ్యాలున్నాయో లేవో నాకు తెలియదు. కానీ ఈ కుర్చీలోకి ఈ శవాన్ని తెచ్చి కూర్చోపెట్టింది దెయ్యం కాదు, మనిషే" అన్నాడు.

"ఆ విషయం ఎలా చెప్పగలుగుతున్నావు?" అడిగాడు శేఖర్. శేషయ్య కుర్చీకి ఒక అడుగు దూరంలో నేల చూపించి టార్చి వెలుగు నేలమీద వేశాడు.

ఎర్రటి అడుగుజాడ కనిపించింది. శేషయ్య టార్చి వెలుగు నేలమీద ముందుకు వేశాడు. ఒకవైపున వరసగా ఎర్రని అడుగుజాడలు తలుపు వరకూ కనిపించాయి.

శేఖరూ, మొద్దబ్బాయి గదిలోకి వెళ్ళారు. ఆ అడుగుజాడలు పరీక్షగా చూసి "ఇది ఎడమపాదం అడుగుజాడ, ఓ అడుగుజాడకీ, ఇంకో అడుగుజాడకీ ఎంత దూరం వుందో చూడు శేషయ్యా! ఒక పాదం జాడలే ఇవి. రెండో పాదం జాడలు లేవు" అన్నాడు ఆందోళనతో.

"అవును. ఒక పాదం జాడలే."

"మనిషి అయితే ఇంకో పాదం ఏదీ? ఒక్క కాలుతో ఎలా నడవగలిగాడు !"

"రెండో పాదానికి రక్తం అంటలేదేమో! అందుకే జాడలు కనిపించలేదేమోనండీ!"

"ఈ రక్తపు జాడని బట్టి ఈ పని చేసింది మనిషేనని ఎలా చెప్పగలవు? ఒక పాదం జాడే ఉండడం బట్టి దెయ్యం కావచ్చనిపిస్తోంది." అన్నాడు శేఖర్.

"దెయ్యాలకి పాదాలుంటాయో ఉండవో, ఉన్నా నేల మీద ఆనతాయో, ఆనవో నాకు తెలియదు. కాని ఈ శవాన్ని ఈ గదిలోకి తీసుకువచ్చింది మనిషేనని నా అభిప్రాయం, ఇది చూడండి!" అన్నాడు శేషయ్య.

శేఖర్ శేషయ్య చూపించిన చోటచూపి "ఏముంది ఇక్కడ? నాకేమీ కనిపించడంలేదే!" అన్నాడు

"ఆ ఎర్రని మడుగు అంచున మసి అనిపిస్తున్నది కదండీ"

"అవును."

"ఈ శవాన్ని ఈ కుర్చీలో ఇక్కడ కూర్చోపెట్టి నేలమీద ఈ రక్తపు మడుగు తయారు చేసిన తర్వాత ఈ మసి పడింది. ఈ మసి తరహా, రంగు బట్టి సిగిరెట్ మసికానీ అయివుండాలని తేలుతోంది."

"అయితే?" అడిగాడూ శేఖర్.

"ఈ శవాన్ని కుర్చీలో కూర్చోపెట్టిన తర్వాత ఈ కుర్చీదగ్గర నిలబడి ఎవరో సిగిరెట్టో వెలిగించారు. ఈ శవాన్ని ఇక్కడికి తీసుకు వచ్చిన మనిషే అయ్యుండాలి. ఇంకెవరన్నా అయితే శవం ఇక్కడ వునన్ విషయం మీకు చెప్పేవాడనుకుంటాను" అన్నాడు శేషయ్య

శేఖర్ నవ్వి "నీ వాదన బాగానే ఉంది. కాని దెయ్యాలు సిగిరెట్ తాగుతాయో, తాగవో నాకు తెలియదు మామయ్య సిగిరెట్ తాగేవాడు" అన్నాడు.

"మనం ఈ గదిలో నిలబడి చెయ్యగలిగిందేమీ లేదు. ఏమయ్యామా అని కిందవున్న వాళ్ళు కంగారు పడుతుంటారు" అన్నాడు శేషయ్య.

"పోదాం పద. ఈ శవాన్ని ఏం చేద్దాం!"

"ఇక్కడే ఉండనివ్వండి."

"మరి పడుకోవడం?"

"అందరూ కింద పడుకుంటే సరి."

27

"పద్మా!"

"ఏమిటి?"

"ఈ వరదలు తగ్గిపోగానే అందరం ఇక్కణ్ణించి వెళ్ళిపోతున్నాము. నువ్వు ఏం చెయ్యదలుచుకున్నావు?" అడిగాడు ప్రసాద్ పక్కన కూర్చుంటూ.

"అంటే?"

"నువ్వు ఎక్కడ ఉండదలచుకున్నావు? నీ భవిష్యత్తు గురించి ఆలోచించావా?"

"ఆలోచించలేదు. ఆలోచించేందుకు ఏముంది?"

"నీకు శేఖర్ అంటే ఇష్టమా!"

పద్మ జవాబు చెప్పలేదు.

"అతని కళ్ళన్నీ ఆ భారతి మీద ఉన్నాయి. నీ సంగతి పట్టించుకునే స్థితిలో లేడు"

"గమనించాను"

"అతని మీద ఆశ పెట్టుకుంటే బాధపడతావు."

పద్మ నవ్వి "ఏం సలహా! మరి నువ్వెందుకు నా మీద ఆశ పెట్టుకున్నావు?" అడిగింది.

"అందుకే చెపుతున్నాను."

"ఏం చెపుతున్నావు?"

"మామయ్య నాకు ఉద్యోగం ఇప్పిస్తానన్నాడు. ఇక్కణ్ణించి మద్రాసుకి వెళ్ళగానే ఏర్పాటు చేస్తానన్నాడు."

"మంచిదే"

"నాతో నీ జీవితం పంచుకోమని మళ్ళీ అడుగుతున్నాను."

"ప్రసాద్! అలా అడగడానికి ఇదా సమయం?"

"నువ్వు చాలా దిగులుగా ఉన్నావని తెలుసు. మీ నాన్న పోవడం వల్ల నీకు దిక్కుతోచక ముందు గతేమని బెంగ పెట్టుకున్నావేమోనని ఈ విషయం ఇప్పుడు ప్రస్తావించాను. క్షమించు."

పద్మ చిన్నగా నవ్వి "ప్రసాద్ నువ్వు ఎంత మంచివాడివోయ్!" అంటూ అతని తల తన ఒళ్ళోకి లాక్కుంది.

"భారతీ!"

"ఏమిటి?"

"ఇలా ఒంటరిగా ఇక్కడ నిలబడ్డావేం. ఎవరు ఒంటిగా ఉండకూడదని చెప్పలేదూ!"

"చెప్పారు. అవతల గదిలో అంతా ఉన్నారుగా అరిస్తే వస్తారు. భయం ఏం ఉన్నది?"

"ప్లీజ్! ఇలాంటి మొండిపనులు చెయ్యక, మన శత్రువు బలం మనకి తెలియదు. జాగ్రత్త అవసరం నీకేదయినా అపాయం కలిగితే నేను - "

"మీరు?"

"తర్వాత ఎలా బతుకుతాను భారతీ! టెన్నిస్ కోర్టు దగ్గర నేను దురుసుగా ప్రవర్తించినందుకు క్షమించు. నీమీద చులకన భావం వల్ల కాదు నీమీద ఇష్టం అలా చేయించింది.

"మీకెవరిమీద ఇష్టం కలిగినా అలా ప్రవర్తిస్తారు ఇష్టాన్ని ఆ విధంగా ప్రదర్శించడం విదేశాలలో నేర్చుకున్నారేమో?"

"ప్లీజ్! అలా హేళన చెయ్యక. ఇంతకు పూర్వం నాకు ఎవరిమీదా అలాంటి ఇష్టం కలగలేదు భారతీ! నిన్ను చూసిన మరుక్షణం నుంచీ నా జీవితానికి ఓ అర్థం, ఓ సార్థకతా ఉన్నట్లు అనిపించింది."

"నేను ఒంటిదాన్ని కాను"

శేఖర్ ఒక అడుగు వెనక్కి వేసి "క్షమించు నాకు తెలియదు. పొరపాటు చేశాను" అని వెనక్కి తిరిగాడు.

"శేఖర్"

"ఏమిటి?"

"నేను ఒంటిదాన్ని కానంటే నాకు తల్లీ, తమ్ముడు ఉన్నారనీ, వాళ్ళని పోషించవలసిన భారం నాది అనీ" నవ్వింది భారతి.

శేఖర్ కూడా నవ్వాడు. "ఓ క్షణం నా గుండె ఆగిపోయింది. నీ వాళ్ళని పోషించే బాధ్యత నాకు ఉండదా భారతీ? నన్ను పెళ్ళిచేసుకుంటావా?"

"మీ నాన్నగారు -"

"నాన్న ఒప్పుకుంటాడు."

## 28

కామరాజు, లింగమూర్తి, ప్రసాద్, శేఖర్, పద్మా, భానుమతి, భారతి హాల్లో పడుకున్నారు. హాలు పక్కనున్న ఇంకో గదిలో శేషయ్య, మొద్దబ్బాయి, రాజారాం, సావిత్రి, మునయ్య వంటమనిషి దాసీది పడుకున్నారు. రెండు గదుల్లోనూ ఒకొక్క లాంతరు వెలుగుతున్నది.

కిటికీల తలుపులు అన్నీ మూసేసి ఉన్నాయి. బయట వాన గాలిహోరుమంటోంది క్రితం రాత్రి కూడా నిద్రలేకపోవడం వల్ల పడుకోగానే శేఖర్‌కి తప్ప అందరికి నిద్రపట్టింది. శేఖర్ ఒక్కడే దిండు గోడకి ఆనించి జారిగిలబడి సిగరెట్ తాగుతున్నాడు.

గోడ గడియారం పన్నెండు గంటలు కొట్టింది. సిగరెట్ నేలమీద నలిపి, ఆవులించి, ఒళ్ళు విరుచుకుని పడుకుందామని అనుకుంటుండగా పైన మెట్లమీద ఏదో చప్పుడయినట్లు వినిపించింది. మెట్లు హాల్లోకి లేవుగాని హాల్లోంచి మెట్లు కనిపిస్తున్నాయి. లాంతరు ఇవతల వైపు ఉండడంవల్ల మెట్లు దగ్గిర వెలుగులేదు. గాలికి ఏ తలుపో కొట్టుకుని ఉంటుందని అనుకుని శేఖర్ దిండు సర్దుకుంటున్నాడు. ఎవరో మెట్లు ఎక్కుతున్నట్లు వినిపించింది తలెత్తి చూశాడు. అస్పష్టంగా మెట్లపైన ఓ ఆకారం కనిపించింది. శేఖర్ లేచి కూర్చున్నాడు. కళ్ళు చిట్లించి చీకట్లోకి చూశాడు. ఆ ఆకారం అక్కడే ఆగిపోయింది. కదలడంలేదు. శేఖర్ టార్చి తీశాడు. టార్చి అద్దం మెట్లవైపు పెట్టి చటుక్కున వెలిగించాడు. వలయాకారంలో టార్చి వెలుగు మెట్లమీద పడ్డది. మరుక్షణం శేఖర్ చెయ్యి ఒణికి టార్చి జారి కిందపడ్డది.

కుర్చీలో కూర్చున్న శవం - వైకుంఠరావు శవం - ఎర్రని చేతులు, ఎర్రగా రక్తమయమైన వేళ్ళు, మెట్లమీద నిలబడి ఉన్నది. అంత ధైర్యస్తుడయిన శేఖర్‌కి భయంవేసి చేతులు ఒణికాయి. ఓ నిమిషంలో తేరుకుని టార్చి మళ్ళీ వెలిగించి మెట్లమీద వేశాడు. ఆ ఆకారం అక్కడ లేదు. కిందికే దిగి వచ్చిందో, వెనక్కి వెళ్ళిపోయిందో తెలియలేదు. వెళ్ళి చూసే ధైర్యం శేఖర్‌కి కూడా లేదు.

"శేషయ్యా!" కేకేశాడు శేఖర్.

"పిలిచావా?" అంటూ ప్రసాద్ నిద్రలేచాడు.

"శేషయ్యని పిలిచాను."

"ఎందుకు?"

శేఖర్ ప్రసాద్‌కి చెప్పాడు.

"రా వెళ్ళి చూద్దాం" అన్నాడు ప్రసాద్.

"నీకు భయంగా లేదూ" అడిగాడూ శేఖర్.

ప్రసాద్ నవ్వాడు " ఆ విషయం దేనికి? వెళదాం పద!" అన్నాడు

ఇద్దరూ మెట్లు దగ్గరికి వెళ్ళారు శేషయ్య లేచి వచ్చి "పిలిచారా?" అడిగాడు.

శేఖర్ శేషయ్యకి చెప్పాడు. శేషయ్య శేఖర్ చేతిలో టార్చి తీసుకుని ముందుకి నడిచాడు. టార్చి వెలుగు మెట్ల మీద వేసి మెట్లు పరీక్షగా చూస్తూ మెట్లు ఎక్కాడు. ఆఖరి రెండు మెట్ల మీద ఎర్రని అడుగుజాడలు కనిపించాయి.

"అయితే కిందకి దిగి వెళ్ళలేదు" అన్నాడు శేఖర్.

శేషయ్య మాట్లాడలేదు. ముగ్గురూ శవం ఉన్న నడవలోకి వెళ్ళారు శవం కుర్చీలోనే ఉన్నది. అంతకుముందు ఎట్లా కూర్చుని ఉందో అట్లాగే ఉంది.

శేఖర్ శవాన్ని పరీక్షగా చూస్తూ తలుపు దగ్గిరే నిలుచున్నాడు. "శేఖర్ గారూ! ఈ శవాన్నే మెట్లమీద చూశానని నిశ్చయంగా చెప్పగలరా?" అడిగాడూ శేషయ్య.

"టార్చి వెలిగించాను. ఆ వెలుగులో చూశాను. నా కళ్ళు నేనే నమ్మలేకుండా ఉన్నాను. శవం నడిచి రావడం ఏమిటి? మళ్ళీ నడిచి వచ్చి కుర్చీలో కూర్చోవడమేమిటి?" అన్నాడు శేఖర్.

శేషయ్య శవాన్ని పరీక్షగా చూస్తున్నాడు. అంతలో కిందనుంచి కెవ్వుమని కేక వినపడింది. చెవులు చిల్లులుపడే కేక. ఇంటికప్పు ఎగిరిపోయేటంత పొలికేక - గుండెలాగిపోయేటంత భయంకరమైన కేక.

ముగ్గురూ కిందకి పరిగెత్తారు.

********

శేఖర్ శేషయ్యని పిలిచిన పిలుపుకి భారతి నిద్రనుంచి లేచింది. తను పడుకుందాం అనుకుంటుండగా ప్రసాద్ లేవడం వాళ్ళ సంభాషణ విన్నది. ఇద్దరూ లేచి వెళ్ళడం చూస్తూ పడుకున్నది. వాళ్ళిద్దరూ వెళ్ళిపోయిన తర్వాత ఆమెకి భయం ఎక్కువై నెమ్మదిగా భానుమతి పక్క మీదకి దొర్లి ఆమెని తట్టి లేపింది.

"ఏమిటి?" అడిగింది భానుమతి.

"నాకు భయం వేస్తోంది" అన్నది భారతి.

"నీ పక్క ఇలా దగ్గరికి జరుపుకో!" అన్నది భానుమతి.

అంతలో మెట్ల దగ్గర ఏదో చప్పుడయింది. ఇద్దరు స్త్రీలూ అటు చూశారు.

"ఏమిటా చప్పుడు?" అడిగింది భానుమతి.

"శేఖర్ గారు, మీ అబ్బాయి అయ్యుంటారు. మేడ మీదకి వెళ్ళారు. "

"ఎందుకు? ఆ శవం ఉన్న చోటికి ఎందుకు వెళ్ళారు?"

"ఏదో చప్పుడయేటప్పటికి చూడడానికి వెళ్ళారు" భారతి అంటుండగా లాంతర్ మీద ఏదో పడినట్లు ఖంగుమన్నది. ఇద్దరూ ఉలిక్కిపడి చూశారు. లాంతర్ పక్కకి పడిపోయింది. చిమ్నీ పగిలిపోయింది. వత్తి నేలకి తగిలింది. ఆరిపోతూ సన్నగా వెలుగుతోంది.

"లాంతర్ కింద పడింది" అన్నది భారతి.

"అవును తీస్తానుండు" అని భానుమతి లేచి రెండడుగులు వేసి ఆగిపోయి తలుపు వేపు చూస్తూ నిలబడ్డది. భారతిని పిలవబోయింది కాని పిలవలేకపోయింది.

భారతి లేచి భానుమతి దగ్గరికి వెళ్ళింది. భానుమతి నోటమాట లేదు. కనుగుడ్లు పెద్దవి చేసి చూస్తోంది. చీకట్లోకి భారతి కూడా అటు చూసింది తన కళ్ళు తను నమ్మలేక, చూడలేక, చూడకుండా ఉండలేక రాతి బొమ్మలా నిలబడ్డది.

మెట్ల పక్కనున్న గోడని ఆనుకుని నిలుచున్నది ఓ ఆకారం ఇకిలిస్తున్నట్లు పళ్ళు బయటికి కనపడుతున్నాయి. ఒళ్ళంతా ఎర్రగా ఉంది. రక్తం - రక్తంతో పూర్తిగా తడిసిపోయిన ఒళ్ళు. చేతుల వేళ్ళ కొనలనుంచి రక్తం కారుతోంది. నేలమీద ఎర్రగా మడుగు కట్టింది. భారతి కేకలు పెట్టి అందర్నీ లేపాలనుకుంది కాని గొంతు పెగలలేదు. ఆ రూపం కళ్ళు సూటిగా ఆమె కళ్ళల్లోకి చూస్తూ ఆమెను మంత్రముగ్ధురాల్ని చేసేస్తున్నాయి.

అంతలో ఎవరో అవతల గదిలో కదులుతున్నట్లు అలికిడి అయింది. గోడమీద పెద్ద నీడ - కప్పువరకూ పడుతున్న నీడ - కనిపించింది. ఆ నీడనీ, ఆ నీడలో కలిసిపోయిన ఆ ఆకారాన్ని చూస్తూ నిలబడిపోయారు వాళ్ళిద్దరూ. పక్కగదిలోంచి ఎవరో లేచివస్తున్నట్లు అడుగుల చప్పుడు - వినీవినపడని చప్పుడు ఆ మనిషి నీడే అది. అవతల గదిలో ఉన్న లాంతర్‌కి అడ్డంగా రావడంవల్ల ఆ మనిషి నీడ మీద పడుతోంది.

వెనక్కి వెళ్ళి గోడకి అతుక్కున్నట్లు నిలబడింది మెట్ల పక్కన వున్న ఆకారం. అవతల గదిలోంచి వచ్చిన మనిషి మెట్లదగ్గరికి వచ్చాడు.

అతను మొద్దబ్బాయి, భారతినీ, భానుమతినీ చూశాడు. వాళ్ళూ అతన్ని చూశారు. మాట్లాడవద్దన్నట్లు నోటిమీద వేలు పెట్టుకుని సంజ్ఞ చేసి, మెట్లపక్కకి ఒక్క అడుగు వేశాడు.

మెట్ల పక్కనున్న ఆకారం మెరుపులా కదిలింది - రెండు చేతులూ పైకెత్తి ఒక్క గంతేసింది, బిగించిన పిడికళ్ళతో మొద్దబ్బాయి తలమీద బాదింది. మొద్దబ్బాయి నేలమీద పడిపోయాడు. ఆ ఆకారం భానుమతీ, భారతీ నిలుచున్న వైపు వచ్చింది.

ఇద్దరూ ఒక్కసారిగా చెవులు చిల్లులు పడేటట్లు అరిచారు. ప్రాణాలు పోతున్నట్లు కేకలు పెట్టారు. గొంతులు చించుకుని బొబ్బలు పెట్టారు. వెనక్కి తిరిగి పరిగెత్తారు. కొంచెం దూరం పరిగెత్తి ఇద్దరూ కింద పడిపోయారు.

## (వచ్చే సంచిక వరకూ ఈ సస్పెన్స్ భరించాల్సిందే..!)

ఈ నవల క్రిందటి భాగాలు ఇంకా చదవలేదా..? లేక మళ్ళీ ఒకసారి చదువుదామనుకుంటున్నారా? వెంటనే కౌముది గ్రంథాలయాన్ని సందర్శించండి..

Click here to go to KOUMUDI Library

